ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

కన్హా శాంతివనంలో ప్రధాని నరేంద్ర మోదీ

నందిగామ, నవంబర్ 26: ధ్యానం, యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలోని శ్రీరామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్ వ్యవస్థాపకులు బాబూజీ మహరాజ్ స్మారక ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్‌తో కలిసి మొక్కలు నాటారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. లక్ష మంది అభ్యాసీలు ఒకే దగ్గర కూర్చొని ధ్యానం చేసేలా ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం,

కన్హాలో బాబూజీ మహరాజ్ స్మారక ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ, ధ్యాన గురువు కమలేశ్ పటేల్

కన్హాశాంతి వనంలోని ఆహ్లాదకరమైన వాతావరణంలోకి రావడం తనకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. యోగా, ధ్యానం ప్రాచీన జ్ఞానులు అనుసరించిన సంప్రదాయాలను ప్రజలకు పరిచయం చేసేందుకు శ్రీరామచంద్ర మిషన్, కన్హాశాంతివనం చేస్తున్న కృషిని గుర్తించి భారత ప్రభుత్వం దాజీకి పద్మభూషణ్ అవార్డు అందించిందని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ ధ్యానం, యోగా క్రమం తప్పకుండా చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నదని, కరోనా విపత్కర పరిస్థితులలో టీకాలు అందించి ఇతర దేశాలకు చేయూతనందించడంతో ప్రపంచ దేశాలు భారత్ వైపు చూశాయని తెలిపారు. భారతదేశం మరింత బలోపేతం కావడానికి నారీ శక్తి, యువ శక్తి, శ్రమ శక్తి, ఉద్యమ శక్తి ఎంతో అవసరమని ఉద్ఘాటించారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటుపడకుండా చూడాలని, మాదకద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 40 వేల మందికి పైగా అభ్యాసీలు పాల్గొన్నారు.

క్రైస్తవ సంఘాల మద్దతు బీఆర్ఎస్‌కే

కాంగ్రెస్‌ను నమ్మే ప్రసక్తే లేదని స్పష్టీకరణ

మారేడ్‌పల్లి, నవంబర్ 26: క్రైస్తవ సమాజం కాంగ్రెస్ పార్టీని నమ్మడం లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే క్రైస్తవులకు న్యాయం జరుగుందని పలు క్రైస్తవ సంఘాలు స్పష్టం చేశాయి. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇవ్వకుండా మోసగించిన కాంగ్రెస్‌ను క్రైస్తవులు ఎప్పటికీ నమ్మరని క్యాథలిక్ అసోసియేషన్ తెలంగాణ, తెలంగాణ క్యాథలిక్ లేమోన్ వెల్ఫేర్ అసోసియేషన్, ఆలిండియా క్యాథలిక్ అసోసియేషన్, తెలంగాణ తమిళ సంఘం నేతలు మెల్విన్ బెనెడిక్, ఆంథ్రూస్ జేవియర్, కిస్టోఫర్ షిండే, పాల్ సంపత్ కుమార్, జెరూసలేం మత్తయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 1950లో క్రైస్తవ మతంలోకి మారిన జైనులు, సిక్కులు, బౌద్ధులను ఎస్సీలుగా గర్తించినప్పటికీ దళిత క్రైస్తవులకు మాత్రం ఆ హోదా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అసెంబ్లీ తీర్మానం చేసినప్పటికీ నాటి యూపీఏ ప్రభుత్వం దాన్ని అమలు చేయలేదని తెలిపారు. తెలంగాణలో క్రైస్తవులు ప్రశాంతంగా జీవించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం వీలుకల్పించిందని, అందుకే క్రైస్తవ సంఘాలన్నీ బీఆర్ఎస్‌కే మద్దతు పలుకుతున్నాయని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురు మృతి

ముంబై, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రంలోని నాసిక్ జిల్లాలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. మన్మాడ్-యెవలా హైవేపై అంకాయి దగ్గర ట్రక్కు, కారు ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారులో ఉన్న ఐదుగురు యువకులు మృతి చెందారు. మృతులంతా నాసిక్‌లోని గంగాపూర్‌కు చెందినవారు. వీర ంతా మన్మాడ్ సమీపంలోని మసోభా ఆలయానికి వెళ్లి నాసిక్‌కు వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

సీపీఎంతో కాంగ్రెస్‌కు ముప్పు

- కనీసం 10 నియోజకవర్గాల్లో ఓటమి భయం
- నల్లగొండ, ఖమ్మం జిల్లాలో తీవ్ర ప్రభావం

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను సీపీఎం కలవరపెడుతున్నది. ఆ రెండు పార్టీల మధ్య పొత్తు చర్చలు విఫలమైన నేపథ్యంలో సీపీఎం రాష్ట్రంలోని 19 స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తున్నది. ముఖ్యంగా ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లో సీపీఎం పోటీ చేస్తున్న స్థానాల్లో కాంగ్రెస్ పెద్ద దెబ్బ పడుతుందని భావిస్తున్నారు. ఖమ్మం జిల్లా పాలేరు, నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గాల్లో సీపీఎం సాధించే ఓట్లు కీలకం కానున్నాయి. పాలేరులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్వయంగా పోటీ చేస్తుండటంతో కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఓటమి భయం వెన్నాడుతున్నది. నల్లగొండ నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి పోటీలో ఉండటంతో కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విజయావకాశాలను దెబ్బతీస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. నకిరేకల్‌లో సీపీఎం కారణంగా కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశంకు ఓటమి తప్పదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మొత్తంగా కనీసం పది స్థానాల్లో కాంగ్రెస్‌ను సీపీఎం గట్టి దెబ్బ తీస్తుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. కొత్తగూడెంలో సీపీఐ, కాంగ్రెస్ మధ్య పొత్తు ఉన్నప్పటికీ జలగం వెంకట్రావు ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీ చేస్తుండటంతో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కొత్తగూడెంలో బీఆర్ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు, సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు, ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగం వెంకట్రావు మధ్య త్రిముఖ పోరు నడుస్తున్నది.

కాంగ్రెస్ తప్పుడు ఫిర్యాదులతో ఎన్నికల సంఘానికి తిప్పలు

- గాలి వార్తలతో ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు ఇబ్బందులు
- బీఆర్ఎస్ పార్టీ నేతలు, వారి బంధువుల పైనే గురి
- మాజీ అధికారులనూ ఇరికించే ప్రయత్నం

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో అక్రమాలకు, తాయిలాలకు చెక్‌పెట్టేందుకు ప్రవేశపెట్టిన 'సీ-విజిల్' యాప్‌ను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దుర్వినియోగం చేస్తున్నారు. తప్పుడు సమాచారంతో బీఆర్ఎస్ నేతలపై ఉత్తుత్తి ఫిర్యాదులు చేస్తూ ఎన్నికల సంఘం విధులకు ఆటంకం కగిలిస్తున్నారు. 'ఇదిగో పులి అంటే అదిగో తోక' అన్న చందంగా సోషల్ మీడియాలో గాలి వార్తలను వండివార్చి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్స్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో మాజీ ఐఏఎస్ అధికారి ఏకే గోయెల్ నివాసంలో కాంగ్రెస్ జరిపించిన ఐటీ సోదాలే ఇందుకు తాజా నిదర్శనం. గోయెల్ ఇంట్లో కోట్ల రూపాయల డబ్బు, భారీగా మద్యం ఉన్నదన్న ఫిర్యాదులో నిజం లేదని సోదాల్లో తేలడంతో కాంగ్రెస్ నేతలపై పరువు నష్టం దావా వేసేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఈ సోదాలకు ముందు మంత్రి సబిత, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, మర్రి జనార్దన్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి వారి బంధువుల ఇండ్లు, కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి వారిని తీవ్రంగా ఇబ్బంది పెట్టిన దర్యాప్తు సంస్థల అధికారులు.. దేశంలో ఒక్క బీజేపీ నేత ఇంటిలోనూ సోదాలు జరిపిన దాఖలాలే లేవు.

జనగామలో రేవంత్‌పై కేసు

- సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు చర్యలు

జనగామ చౌరస్తా, నవంబర్ 26: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై ఆదివారం జనగామ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అర్బన్ ఇన్‌స్పెక్టర్ ఎలబోయిన శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న జనగామ నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రగతి భవన్‌ను బాంబులతో పేల్చివేయాలని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ 150 పడక గదుల రాజభవన గృహాన్ని రూ.2 వేల కోట్లతో నిర్మించారంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ప్రగతి భవన్‌లోకి తెలంగాణ వాళ్లకు, దళితులు, నిరుద్యోగులు, ప్రజా ప్రతినిధులకు ప్రవేశం లేదని ఆరోపణలు చేశారు. కమ్యూనిస్టు పార్టీలకు కూడా ప్రవేశం లేదన్న వ్యాఖ్యలపై బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్ కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. జనగామ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డిపై అర్బన్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు.

ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల సీట్ల కేటాయింపు

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల భర్తీకి ఆదివారం నిర్వహించిన తుది విడత కౌన్సెలింగ్‌లో 209 సీట్లు నిండాయి. 609 సీట్లకు 209 సీట్లను విద్యార్థులు దక్కించుకొన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు డిసెంబర్ 1లోపు కాలేజీలో టీసీని సమర్పించాలి.

క్యాట్ ప్రశ్నలు మధ్యస్థం నుంచి కఠినం

హైదరాబాద్, నవంబర్ 26 (నమస్తే తెలంగాణ) : ఐఐఎంలు సహా బిజినెస్ స్కూళ్లలో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన క్యాట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. క్యాట్ పరీక్షాపత్రంలో ప్రశ్నలు మధ్యస్థం నుంచి కఠినంగా వచ్చాయి. ఉదయం మొదటి షిఫ్ట్ పరీక్ష మధ్యస్థంగా ఉండగా, రెండో షిఫ్ట్ పరీక్ష మధ్యస్థం నుంచి కఠినంగా ఉన్నది. ఇక మూడో షిఫ్ట్ పరీక్ష కూడా మధ్యస్థం నుంచి కఠినంగా ఉన్నట్టు విద్యార్థులు తెలిపారు. ఇక ఫలితాలు 2024 జనవరి రెండో వారంలో విడుదలయ్యే అవకాశాలున్నాయి.

మరిన్ని వార్తలకు www.ntnews.com చూడండి